పట్టణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పార్వతీపురంటౌన్:

పట్టణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘంలో పలు విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా గృహనిర్మాణం, రహదారులు, కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా గృహనిర్మాణ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో ఇదివరకే టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు టెండర్లకు సంబంధించిన సీసీ రహదారులు, కాలువల నిర్మాణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఎవరైనా కాంట్రాక్టర్లు సకాలంలో పనులు చేయకపోయినా, ప్రారంభించకపోయినా అటువంటివారిని హిట్‌లిస్టులో పెట్టి కొత్త వారికి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. సమీక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రభుత్వం, ప్రజలకు వారధులు గృహ సారథులే

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి గృహ సారథులు రథసారథుల్లా పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 3వ సచివాలయం పరిధి (కొత్తవలస-1)గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించి విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలోని గృహసారథులు వారికి కేటాయించిన 50కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించి సేవ చేసేలా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కొత్తగా నియమితులైన గృహ సారథులను పరిచయం చేసుకుని జగనన్న కుటుంబంలో సభ్యులుగా చేరినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యానర్లు, వాల్‌పోస్టర్లు తొలగించాలి

సీతానగరం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలు చేయడానికి మండలంలో అందరూ సహకరించాలని సహాయ ఎన్నికల అధికారులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డిలు శుక్రవారం వివిధ గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురువారం నుంచి అమలులోకి రావడంతో గ్రామాల్లో ఎవరైనా రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, జెండాలతో తిరుగాడితే తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు ఎన్నికలు ముగిసేవరకూ ఎన్నికల కోడ్ అమలు చేయాలని సూచించారు.అనంతరం ఎంపీడీఓ జోగింపేట వద్ద రాష్ట్ర రహదారిపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, జెండాలు, వాల్ పోస్టర్ల తొలగింపు చర్యలు తీసుకున్నారు.


జోగింపేట వద్ద బ్యానర్లను తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

ఎన్నికల నిబంధనలకు లోబడి సామాజిక తనిఖీలు

సీతానగరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిబంధనలకు లోబడి జరుగుతున్నాయని ఉపాధిహామీ పథకం ఏపీఓ నాగలక్ష్మి, ఈసీ కృష్ణ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉపాధిహామీ పనులు, చేసిన ఖర్చులు, అధికారుల పనితీరు తదితర అంశాలపై సెర్ప్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఒకరు, జిల్లా రిసోర్స్ పర్సన్లు 8 మంది, గ్రామ రిసోర్స్ పర్సన్‌లు సామాజిక తనిఖీలు చేస్తున్నారని తెలియజేశారు. ఈ తనిఖీల అనంతరం మార్చి 3న ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మండల స్థాయిలో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు

సీతానగరం: మండలంలోని రైతులనుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించడానికి అధికారుల సమన్వయంతో అంతా కొలిక్కి వచ్చిందని ఏఓ ఎస్ అవినాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు మండలంలోని రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను ఇటీవల పరిశీలించి ఆర్బీకేలద్వారా సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం నివేదిక పంపించగా ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి శనివారం నుంచి కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు.

శివరాత్రికి సిద్ధమైన శివాలయాలు

సీతానగరం: మహాశివరాత్రి ఉత్సవాలను పుస్కరించుకుని శివాలయాలను పూజలకు సిద్ధం చేశారు. మండలంలోని పలుగ్రామాల్లో శివాలయాలు ఉన్నాయి. శనివారం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా అర్చకులు భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన పంచముఖేశ్వర, వీరబ్రహ్మేంద్ర, కాశీ విశ్వేశ్వర స్వామివార్ల ఆలయాలను, బూర్జ, లచ్చయ్యపేట, బళ్లకృష్ణాపురం, మరిపివలస, గుచ్చిమి గ్రామాల్లో ఆలయాలను సుందరంగా అలకంరించారు.

టార్గెట్-175 లక్ష్యంగా పనిచేద్దాం


పాలకొండ: మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు దోల జగన్

● మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: టార్గెట్-175(రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు) లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన వారు 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి,వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, ఎంపీపీ బొమ్మాళి భాను తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో శుక్రవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరై, 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. నాలుగేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సిబ్బంది దాతృత్వం

పాలకొండ: స్థానిక యూనియన్ బ్యాంకు సిబ్బంది దాతృత్వం ప్రదర్శించారు. మేనేజర్ రవికిరణ్, సిబ్బంది కలిసి తమ వద్ద ఎంతో నమ్మకంగా పని చేసి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.3.50 లక్షల ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. తుడ్డలి గ్రామానికి చెందిన నందీశ్వరరావు(వెంకన్న) తాత్కాలిక పద్ధతిలో కొన్నేళ్లుగా బ్యాంకులో పనిచేస్తున్నారు. జనవరి నెలలో సింగన్నపాలెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకన్న తీవ్రగాయాలపాలై, మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీధినపడిన ఆయన కుటుంబానికి ఆర్థికసాయం చేసి, ఆదుకునేందుకు ముందుకువచ్చారు. సిబ్బంది అంతా చందాలు వేసుకుని మరీ సేకరించిన నగదు మొత్తాన్ని మృతుని కూతురు రాఘవి పేరిట బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసి, డిపాజిట్ చేశారు. అనంతరం సంబంధిత బ్యాంకు బుక్, పత్రాలను వెంకన్న భార్య సత్యవతికి అందజేశారు.


మృతునికి కుటుంబ సభ్యులకు నగదు పత్రాలు అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


దుర్ఘటనలో నుజ్జునుజ్జు అయిన లారీల ముందు భాగాలు

కొమరాడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న బాలురు వసతి గృహం వద్ద శుక్రవారం జరిగింది. పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న ఓ లారీ, రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న మరో లారీ ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. రెండు లారీల ముందు భాగాలు నుజ్జునుజ్జు కాగా, తెలంగాణలోని ఖమ్మం జిల్లా, మధిర ప్రాంతానికి చెందిన డ్రైవర్ ఎస్.గణేష్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, వైద్యసేవల నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారని ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కొమరాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యారోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును పరిశీలించిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణులకు చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.


రోగుల సేవలపై ఆరాతీస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

256 లీటర్ల సారా ధ్వంసం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన 256 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కళాధర్ శుక్రవారం తెలిపారు. గతంలో పట్టుబడిన 17 మద్యంబాటిళ్లను కూడా ధ్వసం చేశామని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు మండల కేంద్రంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, పాఠశాలల విలీనం నిలిపివేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, రమణ, సూర్యనారాయణ, జయప్రద, పద్మజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాజరువేసే సమయంలో వేతనదారులు ఉండాలి


అరసాడలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కేశవరావు

బలిజిపేట: ఉపాధి పనులకు వచ్చే వేతనదారులు సిబ్బంది హాజరువేసే సమయంలో తప్పనిసరిగా ఉండాలని ఏపీఓ కేశవరావు కోరారు. మండలంలోని అరసాడలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఒకరికి బదులు వేరొకరు పనిలోకి రాకూడదని, సిబ్బంది వారిని అనుమతించకూడదని చెప్పారు. నిర్ధారించిన పని పూర్తిచేయడం వలన వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

చురుగ్గా బైపాస్‌రోడ్డు నిర్మాణం


బైపాస్ రోడ్డును ఎన్‌హెచ్26కు అనుసంధానం చేస్తూ జరుగుతున్న పనులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో పట్టణంలోని దుగ్ధసాగరం సమీపం నుంచి జీగిరాం వరకు పట్టణ బైపాస్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ రోడ్డును జీగిరాం వద్ద ఎన్‌హెచ్ 26కు అనుసంధానం చేస్తున్నారు.సుమారు రూ.32 కోట్లతో ఈ రోడ్డు పనులు చేపట్టారు. స్థానికంగా నెల కొన్న అడ్డంకులు ఇటీవల తొలగిపోవడంతో పనులు ఊపందుకున్నాయి. నెల రోజుల్లో పనులు పూర్తిచేసి అప్పగించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన బైపాస్ నిర్మాణం పూర్తయితే రహదారి సమస్యతో పాటు వాయు, శబ్ద కాలుష్యం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంది.

జాతీయ జట్టుకు గణేష్ ఎంపిక


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బలిజిపేట ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గణేష్‌ను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఇతర ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పల్నాడులో జరిగిన అండర్-14విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో విజయనగరం జట్టు గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ జట్టులో ఆడిన గణేష్ జాతీయ జట్టుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గణేష్ జాతీయ జట్టుకు ఎంపికకావడం సంతోషంగా ఉందంటూ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఈటీలు టి.పరశురాం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశవాళీ ఆవుకు పుంగనూరు దూడ జననం


దూడను సాకుతున్న ఆవు

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం గ్రామానికి చెందిన కె.రత్నాకర్ దేశవాళీ ఆవు అరుదైన పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. మండలంలోని అయిదు గ్రామాల్లో పుంగనూరు జాతి దూడలున్నాయి. ఈ విషయమై పశువైద్య సహాయసంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ సీతానగరం పశువైద్య కేంద్రంలో దేశవాళీ ఆవులకు ఎద ఇంజక్షన్‌లు చేశామని, ఈ మేరకు పుంగనూరు దూడను దేశవాళీ ఆవు ఈనినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇటువంటి అరుదైన జాతికి చెందిన పశు సంపదను రక్షించడానికి కృషి చేస్తుందని తెలిపారు.

కుమ్మరులను ఆర్థికంగా ఆదుకోవాలి

భామిని: మట్టికుండల తయారీని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న కుమ్మరులను ఆర్థికంగా ఆదుకోవాలని మండల శాలివాహన కుమ్మర సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ కులస్తులను కూడా ఆదుకునేలా చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు

● డీఎస్పీ ఎ.సుభాష్



పార్వతీపురం టౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 18న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ ఎ.సుభాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం డివిజన్‌లో పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ మెయింటైన్ చేసేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పార్వతీపురం మండలం అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర, సాలూరులోని పంచముఖేశ్వర, పాచిపెంట మండలం పారమ్మకొండ, కొమరాడ మండలం గుంప సోమేశ్వర ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నదులు, కాలువలు, కోనేరు, సముద్ర స్నానాలు చేసే సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల్లో మునిగి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయాల వద్ద తాత్కాలికంగా పోలీసు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి, సహాయం పొందాలని సూచించారు. పుణ్య స్నానాలు చేసే సమయంలోను, కొండలు ఎక్కే సమయంలోను, దైవ దర్శనాలకు వెళ్ళే సమయంలో మహిళలు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిని ఎట్టి పరిస్థితుల్లోను ఒంటరిగా విడిచిపెట్టవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని, పార్కింగు ప్రాంతాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలన్నారు.

డీసీసీబీ సేవలపై రైతులకు అవగాహన

మక్కువ: డీసీసీబీ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్రాంచ్‌మేనేజర్ సుందర్రావు కోరారు. మండలంలోని శంబర గ్రామంలో పీఏసీఎస్ ఖాతాదారులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు మంచి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాబార్డ్, డీసీసీబీ కౌన్సిలర్ పి.తిరుమలరావు మాట్లాడుతూ నాబార్డ్ సౌజన్యంతో, డీసీసీబీ ఆధ్వర్యంలో రైతులకు బ్యాంక్‌సేవలపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవింగ్ అకౌంట్స్ తెరవడం, ఫిక్స్‌డ్ డిపాజిట్స్, రికరింగ్ డిపాజిట్స్, రూపేకార్డు ఏవిధంగా వినియోగించుకోవాలి, సోషల్‌సెక్యూరిటీ స్కీం వలన ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ సింహాచలం, పీఏసీఎస్ ప్రెసిడెంట్ గంజి లక్ష్మీనారాయణ, సెక్రటరీ అక్యాన శ్రీనివాసరావు, మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న నాబార్డు, డీసీసీబీ కౌన్సిలర్ తిరుమలరావు

ప్రజలకు సకాలంలో సేవలందించాలి

పార్వతీపురం టౌన్: ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలను అందించాలని ఆర్‌డీఓ కె.హేమలత సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయానికి సంబంధించి, ఎన్నికల పెండింగ్ ఫైల్స్‌ను కాలపరిమితిలోగా పూర్తిచేయాలని సూచించారు. ప్రజలనుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ పరిశీలనలో హెచ్‌డీటీ టీవీ.రమణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హేమలత

ఏఆర్‌టీ మందులు వాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్‌టీ మందులు వాడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బగాది జగన్నాథరావు కోరారు. సేఫ్ కేర్ సెంటర్‌లో శుక్రవారం సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చిన వారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎయిడ్స్ నివారణ చర్యలపై సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు సూచనలు ఇచ్చారు . ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గిందని వివరించారు. గర్భిణులు తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని, పుట్టే బిడ్డకు వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. హెపటైటిస్ బి వాక్సిన్ 208 మందికి ఇచ్చామని, ప్రతిరోజూ 20-25 మందికి వాక్సిన్ వేస్తున్నామని ఏఆర్‌టీ వైద్యాధికారి డాక్టర్ జగదీశ్ తెలిపారు. సమావేశంలో జిల్లా సమన్వయకర్త గోపాల్, నెట్‌వర్క్ ప్రెసిడెంట్ పద్మ, లింక్ వర్కర్స్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎస్ఐ బి.శివప్రసాద్ కోరారు. శుక్రవారం పాలకొండ- వీరఘట్టం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన నిబంధనలు అతిక్రమిస్తూ వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని, కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి, మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో మద్యం సేవించి, వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

గృహసారథులే గెలుపు వారధులు


మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

● వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

గరుగుబిల్లి: గృహసారథులే వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో నిర్వహించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. మార్చి 18 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు.

మరోసారి ఇదే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు అహర్నిశలు సైనికుల్లా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.